క్లుప్తంగా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన రాంబాబు



యద్దనపూడి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలెపోగు రాంబాబు గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తనను నియమించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో కార్యకర్తలపై అధికార పార్టీ నాయకులు పెడుతున్న అక్రమ కేసులు, రౌడీషీట్ల విషయంతో పాటు పలు సమస్యలపై ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి పనిచేసి తిరిగి అధికారంలోకి రావడం కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

సీనియర్ న్యాయవాది మృతి



అద్దంకి రూరల్: అద్దంకి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది అన్నమనేని రామస్వామి (90) గురువారం మృతి చెందారు. ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖపట్టణంలో లా పూర్తిచేసి 1961లో బార్ కౌన్సిల్‌లో సభ్యత్వాన్ని పొందారు. అనంతరం ఒంగోలులో లాయర్ కరవది వెంకటేశ్వర్లు వద్ద జూనియర్ పనిచేశారు. అనంతరం కొంతకాలం సొంతంగా ఒంగోలులోనే ప్రాక్టిస్ చేసి 1983 నుంచి అద్దంకిలో లాయర్‌గా కొనసాగారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. రామస్వామి మృతికి అద్దంకి బార్ కౌన్సిల్ సభ్యులు సంతాపం తెలిపారు.

పశుగ్రాసం సాగుకు దరఖాస్తు

బల్లికురవ: సన్న, చిన్నకారు రైతులు పశుగ్రాసం సాగుకు దరఖాస్తు చేసుకోవచ్చని మండల పశువైద్యాధికారి పీ. మహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సొంత పొలం, బోరు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగిన రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగు చేసుకోవచ్చన్నారు. రెండేళ్ల కాల పరిమితికి 10 సెంట్ల సాగుకు రూ. 6600, 50 సెంట్ల సాగుకు రూ. 33,900 ఉపాధి హామీ పథకంలో రైతు బ్యాంకు ఖాతాకు సొమ్ము జమ చేస్తారని పశువైద్యాధికారి తెలిపారు. పశుగ్రాసం సాగుతో పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చన్నారు.

దివ్యాంగులకు సహాయ పరికరాలు

అద్దంకి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దివ్యాంగులకు సహాయ పరికరాలను అందజేయడం కోసం నేటి నుంచి సచివాలయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శింగరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాని కోసం సహాయ పరికరాలు అవసరమైన వారు ఈనెల 24వ తేదీలోపుగా సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలిసి తెలియజేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసర్వేలో కృత్రిమ చేయి, బ్యాటరీతో నడిచే మూడు చక్రాల కుర్చీతో పాటు, ఇతర పరికరాలను అందించనున్నట్లు తెలిపారు.

నేడు మార్టూరులో నర్సరీలపై అవగాహన

మార్టూరు: జిల్లాలోని నర్సరీల యజమానులకు నేడు శుక్రవారం ఉదయం మార్టూరులో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జాతీయ రహదారి పక్కన రాజుపాలెం సెంటర్‌లోని శ్రీసాయి బాలాజీ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభించనున్నట్లు మార్టూరు ఉద్యానవన శాఖ అధికారి బి. హనుమంతు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీల నిర్వహణలో రక్షిత వ్యవసాయ సాగు పద్ధతులు, శాస్త్రవేత్తలతో రైతులకు సలహాలు, ఉద్యానవన పంటల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని నర్సరీలను నిర్వహిస్తున్న యజమానులు, ఔత్సాహిక రైతులు విరివిగా సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గురుకులంలో ప్రవేశానికి 25వ తేదీ ఆఖరు

వేటపాలెం: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల్లో ప్రవేశానికి ఈ నెల 25వ తేదీన ఆఖరు అని ప్రిన్సిపాల్ సీ నారాయణ స్వామి గురువారం తెలిపారు. వేటపాలెం బాలురు, టంగుటూరు బాలికలు, కొండపి బాలురు, మార్కాపురం బాలికలు, యర్రగొండపాలెం బాలురు, కనిగిరి బాలికలు, గురుకులాల్లో ప్రవేశానికి 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. ఈ ఆరు గురుకులాల్లో ఐదో తరగతిలో 400 ఖాళీలు ఉన్నాయన్నాయన్నారు. 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల్లో చేరడానికి 300 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం ఈనెల 27వ తేదీన వేటపాలెం గురుకులంలో నిర్వహించే పోటీ పరీక్షలకు హాజరు కావాల్సిందిగా తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫాగింగ్ చేసేదెప్పుడు ?

- దోమలు విజృంభిస్తున్నా పట్టించుకునే వారేరి ..!
- పంచాయతీల్లో మూలన పడిన ఫాగింగ్ మిషన్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గవినివారిపాలెం గ్రామంలో రోడ్డు మీద ఉన్న చెత్తకుప్ప

చీరాల టౌన్: గ్రామాల అభివృద్ధికి సెక్రటరీలు బాధ్యతగా పనిచేయాలి.. దోమలు వ్యాప్తి చెందకుండా గట్టి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రజలు రోగాల బారినపడకుండా చూడాల్సిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించండని తరచూ మండల పరిషత్ అధికారులు వల్లెవేసే మాటలివే. కానీ ఆచరణలో మాత్రం శూన్యం. 15 గ్రామ పంచాయతీలు ఉన్న చీరాల మండలంలో దోమలను నిర్మూలించే ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికి వాటిని వినియోగించకుండా అటకెక్కించారు. మండలంలోని గ్రామాల్లో ఎక్కడచూసినా అపరిశుభ్రంతో రోడ్లు, మురుగు నీరు దర్శనమిస్తున్నాయి. దోమల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోకపోవడం, మొక్కుబడిగా పారిశుద్ధ్య పనులు చేయడం, మురుగు నీటి కుంటల్లో పైరెత్రం పిచికారీ చేయించడం లేదు.

పంచాయతీ కార్యదర్శుల చేతివాటం..

చీరాల మండలంలో 15 పంచాయతీల్లో ఈపూరుపాలెం, దేవాంగపురి, గవినివారిపాలెం, వాడరేవు గ్రామ పంచాయతీలు మేజర్ పంచాయితీలు. మిగిలినవి 11 మైనర్ పంచాయతీలు. మండలంలో 23991 నివాస గృహాలు ఉండగా 85,696 జనాభా ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు ఉన్న కొద్దిపాటి నిధులను సైతం పంచాయతీ కార్యదర్శులు డ్రా చేసుకుని ఖర్చుల్లో చూపుతున్నారు. 2022 నుంచి గవినివారిపాలెం గ్రామ పంచాయతీలో ఆ కార్యదర్శి సరైన పారిశుధ్య నిర్మూలన, కార్మికులకు సక్రమంగా జీతాలు ఇవ్వకుండా, కనీసం బ్లీచింగ్ కూడా కొట్టకుండా, వీధి దీపాల మరమ్మతుల పేరుతో విడతల వారీగా రూ. 20 లక్షల వరకు డ్రా చేసుకున్నారనే ప్రచారం మండలంలో గ్రామంలో జోరుగా జరుగుతుంది. విడతల వారీగా నిధులన్నీ డ్రా చేసుకున్నప్పటికీ పంచాయతీలో ఏమైనా పరిశుభ్రత పనులు చేపట్టారంటే అదేమీ లేదు. గ్రామాలు మొత్తం అధ్వానంగా తయారైంది. నిధులన్నీ కాజేసిన ఆ పంచాయతీ కార్యదర్శిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, కనీసం విచారణ చేయకపోవడం పంచాయతీరాజ్ అధికారుల వ్యవహారశైలిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలానే మండలంలోని పలు క్లస్టర్ పంచాయతీల్లో సైతం ఇలాంటి అక్రమాలకు పాల్పడి నిధులు డ్రా చేసుకుంటున్నారే కానీ కనీసం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

తుప్పుపట్టిపోతున్న ఫాగింగ్ యంత్రాలు..

ప్రతి పంచాయతీకి ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసినప్పటికి దోమలు నిర్మూలన చేయాల్సి ఉండగా మండల, గ్రామస్థాయి అధికారులు పట్టించుకోక పోవడంతో అవి మూలన చేర్చారు కార్యదర్శులు. కనీసం పదిహేను రోజులకు ఒకసారి కూడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలు రోగాలబారిన పడే అవకాశాలు ఉన్నాయి. మురుగు కాల్వల్లో, చెత్తకుప్పల్లో దోమలు ఉత్పత్తి అయి జనాలపై దాడులు చేస్తున్నాయి. దోమలు నిర్మూలన చేయాల్సిన మిషన్లు, పైరెత్రం పిచికారీ చేయకుండా గ్రామాలను వదిలివేశారు. గతంలో వచ్చిన డెంగీ, విషజ్వరాలకు చీరాల మండలంలోని తోటవారిపాలెం, దేవాంగపురి, రామకృష్ణాపురం గ్రామాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. అప్పట్లో హడావుడి చేసిన వైద్య, ఆరోగ్య అధికారులు, పంచాయతీ పాలకులు పక్క మండలంలో ఉన్న ఫాగింగ్ మిషన్లు తీసుకొచ్చి రెండు రోజులు పాటు ఫాగింగ్ చేశారు. ఆ తర్వాత అయినా మండల అధికారులు తమ మొద్దు నిద్రను విడనాడిన దాఖలాలు లేవు. అసలే పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా మండలస్థాయి అధికారులను కేటాయించడంతో వారీ వారి శాఖల పనులను చేస్తున్నారే కాని కనీసం నెలకు ఒక్కసారి కూడా వారికి కేటాయించిన గ్రామాలను మొక్కుబడిగా కూడా చూసిన దాఖలాలు లేవు. దీంతో గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వారి ఇష్టం వచ్చినట్లు పనిచేస్తున్నారని గ్రామాలను సక్రమంగా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పంచాయతీ కార్యాలయంలో మూలనపడిన ఫాగింగ్ యంత్రం

ఫాగింగ్ చేయాలని ఆదేశాలిస్తాం..

మండలంలో ఉన్న అన్నీ గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. ప్రతి గ్రామంలో విధిగా వారానికి రెండు, మూడు సార్లు ఫాగింగ్ చేయాలి. దోమల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి. గ్రామాలకు ఉన్న ఫాగింగ్ మిషన్లు విధిగా వాడేలా అన్నీ పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలిస్తాం. సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– శివసుబ్రమణ్యం, ఎంపీడీవో

వేద పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

అద్దంకి: విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు వేదపాఠశాలలో ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లాలోని కనిగిరిలో బ్రహ్మశ్రీ ఆకుమల్ల విశ్వరూపాచార్య ఆధ్వర్యంలో ఈ వేదపాఠశాల నడపబడుతుందని తెలిపారు. పాఠశాలలో వేదం సంస్కృతం, వాస్తు, జ్యోతిషం, పంచాంగ పరిజ్ఞానం, ముహూర్త ప్రయోగం, మన్యుసూత్ర ప్రయోగం, సంస్కృత, పౌరోహిత్యం తదితర కోర్సులు నేర్పిస్తారని తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాల్లోని 12 నుంచి 16 సంవత్సరాల్లోపు విశ్వబ్రాహ్మణ విద్యార్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 95429 20400 దొరువు బజారు, కనిగిరి ప్రకాశం జిల్లా వారిని సంప్రదించాలని తెలిపారు.

23న ఉగాది పురస్కారాల ప్రదానం

చీరాల అర్బన్: ఉగాది పర్వదినం సందర్భంగా బత్తుల సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక, సాహితీ, సాంస్కృతిక రంగాల్లో సేవలందిస్తున్న వారికి ఈనెల 23న రోటరీ క్లబ్ భవనంలో ఉగాది పురస్కారాలు అందిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, విశిష్ట అతిథులుగా నర్సరావుపేట డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు, ఆర్టీసీ చీరాల డిపో మేనేజర్ జె.శ్యామల, హాజరవుతారన్నారు. సామాజిక, సాహితీ, సాంస్కృతిక రంగాల్లో సేవలందిస్తున్న 10 మందికి ట్రస్ట్ తరపున పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని వారు కోరారు.

నిరక్షరాస్యతను రూపుమాపే ఉల్లాస్



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పోతురాజు



కారంచేడు వయోజనులతో మాట్లాడుతున్న పర్యవేక్షకుడు మనోరంజన్

కారంచేడు: సమాజంలో నిరక్షరాస్యతను రూపుమాపడమే వయోజన విద్య లక్ష్యమని జిల్లా వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రం కారంచేడు ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వయోజనుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాపట్ల డీఆర్‌డీఏ, ఉల్లాస్-నవభారత్ సాక్షరత ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహణపై ఆయన వయోజనులకు అవగాహన కల్పించారు. గత ఏడాది నవంబర్ నుంచి 15 సంవత్సరాలు అపై వయస్సు కలిగిన వయోజనులకు చదవడం, రాయడంతో పాటు, లెక్కించడం వంటి కార్యక్రమాలకు పదునుపెట్టామన్నారు. ఇప్పటివరకు వయోజన విద్యలో భాగస్తులుగా ఉన్న వారందరికీ మార్చి 23వ తేదీన పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు మీకు వీలైన సమయంలో ఇక్కడకు వచ్చి మూడు గంటల పాటు జరిగే పరీక్షల్లో పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. విజేతలకు అక్షరాస్యులనుగా గుర్తించి జాతీయ సార్వత్రిక విద్యా సంస్థ వారి నుంచి ధ్రువీకరణ పత్రం అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వయోజనులు తదితరులు పాల్గొన్నారు.

చదువు నేర్పించడమే ముఖ్యఉద్దేశం..

పర్చూరు (చినగంజాం): చదువురాని వయోజనులకు వారి రోజువారి పనులకు ఉపయోగపడేలా చదవడం, రాయడం, లెక్కలు చూసుకోవడం నేర్పించడమే ఉల్లాస్ నవభారత్ సాక్షరత కార్యక్రమం ఉద్దేశం అని వయోజన విద్య శాఖ పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్ అన్నారు. గురువారం పర్చూరు వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్చూరు మండలంలో స్వయం సహాయక బృందాలలో మొదటి విడతలో చదువురాని 590 మంది మహిళలను గుర్తించి వారికి వారి బృందాలలోనే చదువుకున్న మహిళలతోనే చదువు చెప్పించామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం కొండ రామకృష్ణ, వెలుగు సీసీలు, వివిధ గ్రామాల యానిమేటర్లు, వలంటీర్, టీచర్‌లు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): ఉల్లాస్ 100 రోజుల కార్యచరణలో భాగంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్‌ను ఏర్పాటు చేశామని.. పరీక్షకు అందరూ హాజరయ్యేలా చూడాలని వయోజన విద్య సూపర్ వైజర్ పోతురాజు అన్నారు. గురువారం మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం అనురాధ అధ్యక్షతన ఇంకొల్లు, జనకవరం, పంగులూరు మండలాలకు చెందిన గ్రామ సంఘ సహాయకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జే పంగులూరు మండల అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్ వైజర్ జ్యోతి, ఇంకొల్లు మండల సీసీలు పాల్గొన్నారు.

మా కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోం



మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె

పర్చూరు(చినగంజాం): కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం తన నివాసంలో తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ఏ ఒక్క కార్యకర్తకు కష్టం వచ్చినా ముందుగా తాను అక్కడ ఉంటానని, అధికార పార్టీ నాయకులు ఎన్ని ఆగడాలు చేసినా న్యాయపోరాటం చేస్తామన్నారు. న్యాయస్థానాల మీద తనకు పూర్తి విశ్వాసం ఉందని ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి కలిసికట్టుగా పోరాడతామని తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు దురుద్దేశంతో ఫారం-7 అర్జీదారుల మీద వేసిన సిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్న సందర్భంగా నియోజకవర్గంలోని కార్యకర్తలు ఆయనను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల అధ్యక్షులు చిన్ని పూర్ణారావు, మాజీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు, గర్నెపూడి రవిచందర్, గంగయ్య, బాగ్యారావు, జాన్ వెస్లీ, శామ్యూల్, విషణరావు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేని డ్రైవర్లతో ప్రమాదాలు



బల్లికురవ పోలీస్‌స్టేషన్ వద్ద నిలిచిన గ్రానైట్ లారీలు (ఫైల్)

బల్లికురవ: గ్రానైట్ ముడిరాయి పరిశ్రమలకు ఎగుమతిచేసే లారీలకు లైసెన్స్, అనుభవం లేని కుర్రకారును డ్రైవర్లుగా నియమించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు అయ్యోపాపం అంటున్న అధికారులు ఆ తదుపరి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి నిత్యం సుమారు 200 నుంచి 250 వరకు లారీలు మార్టూరు, గుండ్లాపల్లి, ఒంగోలు, సంతమాగులూరు, వేమవరం జంక్షన్ ప్రాంతాలకు 60 నుంచి 70 టన్నుల వరకు ముడిరాళ్లను తరలిస్తుంటారు. 10 రోజులు ఆటోలు తోలిన డ్రైవర్లకు లారీ స్టీరింగ్ ఇవ్వడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల బల్లికురవ నుంచి మార్టూరు సమీపంలోని పరిశ్రమకు ముడిరాయితో వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి వారం రోజులు మృత్యువుతో పోరాడి చనిపోయాడు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయి. కొన్ని కేసుల వరకు వెళ్తుండగా కొన్ని రాజీమార్గంలో ధర నిర్ణయిస్తున్నారు. ఇటీవల బల్లికురవ వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ లారీ యజమానులతో సమావేశం నిర్వహించారు. అనుభవం లైసెన్స్ కలిగిన డ్రైవర్లనే నియమించుకోవాలని ప్రమాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అధికారుల తనిఖీలు లేనందున కుర్రకారు డ్రైవింగ్‌కు వాహదారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

నోటి శుభ్రత పాటించడం ముఖ్యం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి చంద్రశేఖర్

పర్చూరు(చినగంజాం): నోటి శుభ్రత పాటించడం ఎంతో ముఖ్యం అని ఉప్పుటూరు హోమియో వైద్యాధికారి డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని ఉప్పుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నవయసు నుంచే నోటి శుభ్రతను పాటించడం వలన భవిష్యత్‌లో వచ్చే దంత సమస్యలు నోటి దుర్వాసన, వంకర పళ్లు వంటి వారి బారిన పడకుండా దూరంగా ఉండవచ్చని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం 2 నిమిషాల బ్రష్ చేయాలన్నారు. నోట్లో ఉండే 300 రకాల బ్యాక్టీరియా దంతాలను పుచ్చి పోయేలా చేస్తాయని వివరించారు. ముఖ్యంగా తీపి, పుల్లటి పదార్థాలు తిన్నతరువాత కచ్చితంగా బ్రష్ చేయాలని ఆయన సూచించారు. జున్ను, పాలు, గుడ్డు, చేప వంటివి ఎక్కువగా తీసుకోవడం వల్ల దంతాలు ధృఢంగా తయారవుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 21 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న నైపుణ్యాభివృద్ధి సంస్థ సభ్యులు

అద్దంకి రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 21 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణాయభివృద్ధి అధికారి పీ. ప్రణయ్ పేర్కొన్నారు. మేళాకు 39 మంది హాజరుకాగా 21 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రణయ్, కళాశాల ప్రిన్సిపల్ లాజరస్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధిశిక్షణ అధికారి శ్రీనివాస్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపిచంద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ బైండోవర్

కారంచేడు: అక్రమ మద్యం, నాటు సారా విక్రయాల కేసుల్లో నిందితురాలిగా ఉన్న మహిళకు మండల మేజిస్ట్రేట్, తహసీల్దారు జీ నాగరాజు ఎదుట బైండోవర్ చేశారు. గురువారం చీరాల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ వారి ఆధ్వర్యంలో నమోదైన కేసులో ఉన్న మహిళను బైండోవర్ చేశామని తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం నిల్వ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అవగాహనతో టీబీ దూరం



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మేదరమెట్ల: టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ఎస్‌టీఎస్ రాజశేఖర్ అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు యర్రంచినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గుకాని, కళ్లె పడే సమయంలో రక్తం, జ్వరం కాని ఉంటే సమీపంలోని వైద్యశాలకు వెళ్లి టీబీ వ్యాధికి సంబంధించిన వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే గడిచిన మూడు మాసాల్లో 5 నుంచి 10 శాతం బరువు తగ్గినా అలాంటి వారు కూడా వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎల్ఎస్ వెంకటరత్నం, వైద్య సిబ్బంది, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మార్టూరు: ఓ టిప్పర్ హఠాత్తుగా రోడ్డు మీదకు రావడంతో రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన మండల కేంద్రం మార్టూరు జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం జరిగింది. బాధితులు, హైవే అంబులెన్స్ సిబ్బంది కోటేశ్వరరావు వివరాల మేరకు.. ఇలా ఉన్నాయి. మార్టూరుకు చెందిన పి.మాధవీలత తన కుమారుడితో కలిసి బైకుపై చిలకలూరిపేట నుంచి మార్టూరుకు సర్వీస్ రోడ్డులో వస్తున్నారు. నాగరాజుపల్లి గ్రామానికి చెందిన కే వీరనారాయణ వీరి కంటే కొంచెం ముందు బైక్‌పై మార్టూరు వెళ్తున్నాడు. స్థానిక దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం ఎదురు గల సర్వీస్ రోడ్డులోకి రాగానే హఠాత్తుగా ఓ టిప్పర్ రావడంతో వీరనారాయణ తన వాహనాన్ని ఆపాడు. ఆ వెనుకే వస్తున్న మాధవీలత కుమారుడు కూడా బైక్‌ను హఠాత్తుగా ఆపడంతో రెండూ ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో బైక్ పైనుంచి జారిపడిన మాధవీలత, వీరనారాయణకు గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మాధవీలతను మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

సాగర్ నీటితో చెరువులు నింపుకోవాలి

బల్లికురవ: వేసవి దృష్ట్యా గ్రామాల వారీగా మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చెరువులన్నింటిని పూర్తి స్థాయిలో సాగర్ నీటితో నింపుకోవాలని తహశీల్దార్ రవినాయక్ కోరారు. నోటిఫైడ్, పీసీడబ్ల్యూఏ స్కీమ్‌ల పరిధిలో ఉన్న చెరువులు, నాన్ నోటిఫైడ్ చెరువులు నీటి కొరత లేకుండా నింపుకోవాలని, మార్చి 31 వరకే సాగర్ జలాలు అందుతాయని తహసీల్దార్ వివరించారు.

సామాజిక సేవ పెంచడానికే స్కాట్, గైడ్స్ లక్ష్యం



స్కాట్‌లో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేటపాలెం: విద్యార్థుల్లో సామాజిక సేవ, దేశభక్తి పెంపొందించడమే స్కాట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమని కెప్టెన్ పీ చైతన్య పేర్కొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో స్కాట్ అండ్ గైడ్ యూనిట్‌ని గురువారం ప్రారంభించారు. 6 ,7, 8తరగతులకు చెందిన 16 మంది బాలికలు 21 మంది బాలురచే యూనిట్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మెడబలిమి శేఖరరావు మాట్లాడుతూ స్కాట్ అండ్ గైడ్స్‌లో సమాజానికి సేవలు అందిస్తారో, క్యాంపుల్లో పాల్గొంటారో వారికి ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. అంతేకాకుండా విద్యార్థులు క్రమశిక్షణ నేర్చుకుంటే జీవితంలో పైకి ఎదగవచ్చని ఉపాధ్యాయులు సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని బాలబాలికలను అభినందించారు.